# గ్రూప్-1లో సత్తా

**14, 55 ర్యాంకులతో ప్రతిభచూపిన కరీంనగర్ జిల్లావాసులు**

కరీంనగర్ రూరల్/కమాన్‌చౌరస్తా, మార్చి 30: కరీంనగర్ జిల్లా కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆదివారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటారు. వివరాల్లోకి వెళ్తే.. వావిలాలపల్లికి చెందిన నక్క శృతిహర్షిత గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 14వ, మల్టీ జోన్‌లో 6వ ర్యాంకు సాధించింది. వావిలాలపల్లిలో పదో తరగతి వరకు, హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్, అలహాబాద్‌లో బీటెక్, ఎన్ఐటీ పూర్తి చేసింది. గ్రూప్-1 రాయాలనే తపనతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నది. 14వ ర్యాంకుతో ప్రతిభ చూపిన శృతిహర్షితకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.



కన్నం హరిణిని సత్కరిస్తున్న బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, తదితరులు

### హరిణికి 55వ ర్యాంకు

అదేవిధంగా జిల్లా కేంద్రానికి చెందిన కన్నం రమేశ్-కళాప్రపూర్ణ జ్యోతి ఉపాధ్యాయ దంపతుల కుమార్తె హరిణి రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంక్ సాధించింది. రమేశ్ స్వగ్రామం ఉమ్మడి కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లి కాగా, వీరు కరీంనరగ్‌లో ఉంటున్నారు. హరిణి ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ (ఈఈఈ) పూర్తి చేసుకుని, బ్యాంక్ ఆఫ్ అమెరికాలో రెండేండ్లు సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉద్యోగం చేసింది. ఆ తర్వాత సివిల్ సర్వీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఈ క్రమంలో తనకు వచ్చిన ర్యాంక్‌తో జోన్-1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం పొందే అవకాశం ఉన్నది. ఈ సందర్భంగా హరిణిని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, నాయకులు చిలుక దేవశంకర్, బేజగం రమేశ్, మనుపాటి రాజయ్య, మేకల స్వరూప అభినందించారు.

### అడవిశ్రీరాంపూర్ వాసికి 333వ ర్యాంక్

ముత్తారం, మార్చి 30: అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మో త్కూరి సురేశ్ గ్రూప్1 ఫలితాల్లో 333వ ర్యాంక్ సా ధించాడు. గతంలో గ్రూప్-3 లో రాష్ట్ర స్థాయి లో ఐదో ర్యాంక్, గ్రూప్-4లో 10వ ర్యాం క్ సాధించాడు. సురేశ్ పదో తరగతి వరకు గ్రామంలోని జడ్పీ పాఠశాలలో, బాసర ఐఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యారు. నాలుగు నెలల క్రితమే ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సురేశ్ తల్లిదండ్రులు గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రూప్1,3,4 లలో మెరుగైన ర్యాంక్ సాధించడంగ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కేటీఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు

పెద్దపల్లి, మార్చి30: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేశ్ కుమార్ తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



కేటీఆర్‌తో రాకేశ్ కుమార్

# పనికి తగిన వేతనమేదీ?



- 'ఉపాధి' కూలీల అసంతృప్తి
- కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపాటు

కలెక్టరేట్, మార్చి 30: ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతన మొత్తంపై క్షేత్రస్థాయిలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చట్టానికి అనుగుణంగా పనికి తగిన వేతనం దేవుడెరుగు.. కనీసం గతేడాది కన్నా అధికంగా అయినా పెంచకపోవడంతో కేంద్ర ప్రభుత్వ తీరుపై కూలీలు మండిపడుతున్నారు. జిల్లాలో 1.24లక్షల జాబ్‌కార్డులుండగా, 2.33లక్షల పైచిలుకు మంది కూలీలు ఉన్నారు. వీరిలో నిత్యం 50నుంచి 60వేల మందికి పైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. చట్టంప్రకారం పనులకు హాజరయ్యే కూలీలందరికీ ఏటా ప్రస్తుతం అమల్లో ఉన్న వేతనంలో కనీసం పది శాతం పెంచాల్సి ఉంటుంది. కానీ, కేంద్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. 2005లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఆరంభంలో కూలీలకు రూ.87.50 చెల్లించేది. ఏటేటా కొద్దిమొత్తంలో పెంచుకుంటూ పోతున్నది. 2022లో రూ.13, 2023లో రూ.12, 2024లో రూ.15 పెంచడంతో వారికి అందించే మొత్తం రూ.300కి చేరింది. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7 మాత్రమే పెంచగా, వచ్చే ఏప్రిల్ నెల నుంచి వారికి రోజుకు రూ.307 చెల్లించనున్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండంకెల్లో పెరిగిన వేతనం, ఈసారి మాత్రం ఒక అంకెకు మాత్రమే పరిమితం కావడంపై విమర్శలు వస్తున్నాయి. రెండేండ్ల నుంచి కొత్త నిబంధనలు అమలు చేస్తూ, వేల సంఖ్యలో జాబ్‌కార్డులు తొలగించినట్లు ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఆయా నెలలను అనుసరించి వేతనంలో 10 నుంచి 20శాతం వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. కానీ పనులు తగ్గించి నిబంధనలు కఠినతరం చేయడంతో కూలీలు కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేస్తునానరు. కూలీల పొట్టకొట్టే విధంగా కేంద్రం వ్యవహరిస్తోన్న తీరును ఉపాధి కూలీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవ్ ఖండించారు. వేతన పెంపును సవరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించారు.

# పన్నుల కోసం పరుగులు

- **మిగిలింది నేడు ఒక్క రోజే.**
- **రామగుండం బల్దియాలో 67 శాతమే ..**

కోల్‌సిటీ, మార్చి 30: రామగుండం నగర పాలక సంస్థలో ఈయేడు పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించడానికి అధికారులు, సిబ్బంది పరుగులు పెడుతున్నారు. మూడు నెలల నుంచి కష్టపడితే చివరి రోజు నాటికి 67 శాతం మాత్రమే వసూలు కాగా, ఇక మిగిలిన ఒక్క రోజులో వంద శాతం చేరుకోవడం అసాధ్యమే. ప్రభుత్వం నుంచి ఈ బల్దియాకు ఆశించిన స్థాయిలో నిధులు విదల్చకపోగా, ఉద్యోగుల జీత భత్యాలు, ఇతర ఆర్థికపరమైన సమస్యల నుంచి గట్టెక్కడం కోసం పన్నులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఈక్రమంలో ఇంటి పన్ను, నల్లా బిల్లుల కోసం వార్డు ఆఫీసర్లను డివిజన్ బాట పట్టించారు. కాగా, ఇప్పటివరకు రామగుండం కార్పొరేషన్‌లో 67 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. కొన్ని చోట్ల ఇంటి పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది ఇంటి యజమానికి రసీదులు ఇవ్వడం లేదు. అడిగితే మిషన్లు రిపేరులో ఉన్నాయని బుకాయిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. కాగా, వంద శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా బకాయిలపై 90శాతం వడ్డీ మినహాయింపు కల్పించారు.

**50వేల గృహాలు...రూ.15 కోట్లు లక్ష్యం...**

రామగుండం కార్పొరేషన్ 50 డివిజన్లలో మొత్తం 50 మంది వార్డు ఆఫీసర్లు, మరో 50 మంది సహాయకులు ఆస్తి పన్ను, నల్లా బిల్లుల వసూళ్లకు బాధ్యతలు అప్పగించారు. కార్పొరేషన్‌లో ప్రైవేటు గృహాలు 50,918 ఉండగా, రూ.15.68 కోట్లు పన్నులు వసూలు నిర్దేశిత లక్ష్యంగా ఉంది. గత మూడు నెలల నుంచి కష్టపడితే చివరి రోజు నాటికి రూ.10కోట్లు పన్నులు వసూలయ్యాయి. మిగిలిన ఒక్క రోజుల్లో దాదాపు రూ.5 కోట్ల మేర బకాయిలు వసూలు కావాల్సి ఉంది. కార్మిక క్షేత్రం కావడంతో ఉదయాన్నే ఇంటి యజమానులు డ్యూటీలకు వెళ్తుండగా, మున్సిపల్ సిబ్బంది కార్యాలయంలో బయోమెట్రిక్ ద్వారా హాజరు పడ్డాక విధులకు బయలుదేరాల్సి ఉంటుంది. ఈలోగా ఇంటి యజమానులు డ్యూటీలకు వెళ్లడంతో పన్నుల చెల్లింపులో ఆలస్యం కావడానికి కారణమవుతున్నది.

**వసూళ్లు సరే...మరీ రసీదులు ఏవి..?**

కొన్ని డివిజన్లలో రసీదులు ఇవ్వకుండా సిబ్బంది పన్నులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల 33వ డివిజన్‌లో ఇంటి పన్ను కోసం వచ్చిన సిబ్బంది మిషన్లు రిపేరులో ఉన్నాయనీ, మరుసటి రోజు రసీదులు తీసుకొచ్చి ఇస్తామని చెప్పి పన్నులు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై నగర పాలక సంస్థ ఆర్.ఓ ఆంజనేయులును వివరణ అడగగా, మిషన్‌ల రిపేరు అనేది అబద్ధమని, ఇంటి పన్నులు చెల్లించేవారు జాగ్రత్తగా ఉండాలనీ, సిబ్బంది రసీదు ఇస్తేనే చెల్లించాలనీ, ఒకవేళ రసీదు ఇవ్వకుంటే కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**90శాతం వడ్డీ మాఫీ కల్పిస్తున్నాం:**

బకాయిలతో సహా ఆస్తి పన్ను మొత్తం చెల్లిస్తే 90 శాతం వడ్డీ మినహాయింపు కల్పిస్తున్నాం. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలను ఏక మొత్తంలో ఒకేదఫా చెల్లిస్తేనే వన్ టైం సెటిల్‌మెంట్ కింద 90 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**అరుణ శ్రీ, ఇన్‌చార్జి కమిషనర్, రామగుండం**

# భళా.. ఉజ్వల

**ఉగాది కళోత్సవాల్లో స్వాగత ప్రదర్శనకు గవర్నర్ ఫిదా**



ఉజ్వలను సత్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కోల్‌సిటీ, మార్చి 30: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ప్రముఖ, అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి గుమ్మడి ఉజ్వలకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో దక్షిణ కేంద్ర జాతీయ భారత భాషా సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ కార్య నిర్వహణలో జరిగిన ఉగాది కళోత్సవాలలో గోదావరిఖనికి చెందిన గుమ్మడి ఉజ్వలకు స్వాగత ప్రదర్శన అవకాశం దక్కింది. ఉజ్వల తొలి గణపతి వందనం, తాండవ నృత్యఖరీ గజానన కూచిపూడి నాట్య సంప్రదాయ పద్ధతిని అలంకరిస్తూ చేసిన ప్రదర్శనకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతోపాటు ఐఏఎస్ దాన కిశోర్, డీజీపీ డా జితేందర్, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి ఫిదా అయ్యారు. భళా..గుమ్మడి ఉజ్వల అంటూ స్వయాన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ గోదావరిఖని నృత్యఖని పేరు ప్రస్తావించారు. గోదావరిఖనిలో నృత్య ఖని స్థాపించి ఎంతోమందికి కూచిపూడి తర్ఫీదు ఇవ్వడమే గాకుండా.. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు కూచిపూడి నృత్యం విలువలపై అవగాహన కల్పించి ఆసక్తిఉన్న వారికి శిక్షణ ఇవ్వడానికి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలుసుకొని ఆమెను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఉజ్వలను గవర్నర్ శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు.

## రెవెన్యూ గార్డెన్ సీజ్

- **పన్ను బకాయిలు చెల్లించకపోవడమే కారణం**

కార్పొరేషన్, మార్చి 30: నగరంలోని రెవెన్యూ గార్డెన్‌ను నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు ఆదివారం సాయంత్రం సీజ్ చేశారు. రెవెన్యూ గార్డెన్, క్లబ్ నుంచి నగరపాలక సంస్థకు రూ.82లక్షల మేరకు పన్నులు రావాల్సి ఉందని ఆర్వో భూమానందం తెలిపారు. బకాయిలు చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

### ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడి

బసంత్‌నగర్, మార్చి 30: పాలకుర్తి మండలంలోని ముంజపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక డంప్ చేసి తరలిస్తుండగా శనివారం అర్ధరాత్రి బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి దాడులు నిర్వహించారు. గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించుకొని నిల్వతో హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలిస్తుడంగా ఎస్ఐ పట్టుకోని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారిపై కేసునమోదుతో రెండు టిప్పర్ లారీలు, ఒక జెసీబీనీ సీజ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఎండపల్లి మండలం చీరాలపల్లికి చెందిన బుర్ర మహిపాల్, అంబర్‌పేట వాసి ముంజల సురేశ్, ధర్మారం మండలం రాయపట్నంకు చెందిన తనుగుల తిరుపతి, వెల్గటూర్ మండలం పాసిగాం నివాసి వాసం సతీశ్, బుగ్గారం మండలం, ముద్దునూర్‌కు చెందిన గుమ్ముల రాజేందర్ ఉన్నారు.

### పెండింగ్ సమస్యలపై చర్చించాం

గోదావరిఖని, మార్చి 30: ఈ నెల 28 నుంచి 30 వరకు రాంచీలో జరిగిన ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ 11వ జాతీయ మహాసభల్లో సింగరేణిలో దీర్ఘకాలంగా పెండింగ్ సమస్యలపై చర్చించినట్లు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంద నరసింహారావు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలతో నష్టపోతున్నట్లు తెలిపారు. కోల్ ఇండియాల అమలు చేస్తున్న అగ్రిమెంట్లను సింగరేణి అమలు చేయకపోవడంతో పెండింగ్‌లో ఉన్న సమస్యల మాట్లాడినట్లు తెలిపారు. సభలో భవిష్యత్ బొగ్గు సంస్థల పరిరక్షణతో పాటు కార్మిక సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆందోళనకు పలు తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలకు సింగరేణి నుంచి యూనియన్ ఉపాధ్యక్షుడిగా తుమ్మల రాజారెడ్డి, కార్యదర్శులుగా మంద నరసింహారావు, అల్లి రాజేందర్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా మెండె శ్రీనివాస్, మేదరి సారయ్య, విజయగిరి శ్రీనివాస్, కంపేటి రాజయ్య, కుంట ప్రవీణ్, వెంగళ శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.




# ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో పన్ను లాభం

**తపాలా** శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీముల్లో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం-1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

### నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్ఎస్‌సీ)

ఎన్ఎస్‌సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్ఎస్‌సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

### సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)


ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్ఎస్‌వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

### సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్)

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

### ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపులుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్-జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.



# గోల్డ్ Vs నిఫ్టీ 50

**దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?**



**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి-మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

**ఇదీ సంగతి..**

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

**దీర్ఘకాల రాబడులు**

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8-10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12-15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

**ద్రవ్యోల్బణం సవాళ్లు**

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

**ఒడిదుడుకులు**

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

**ద్రవ్య లభ్యత**

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.


**పోర్ట్‌ఫోలియో**

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

**చివరగా..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!




**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్టు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800-24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

***స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.***

# ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి




నేడు వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె-కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్ల లోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.

